వ్యాయామంతో వ్యాధులు దూరం

- వాకింగ్, సైక్లింగ్‌పై ఆసక్తి
- యువతలో పెరుగుతున్న అవగాహన
- సంపూర్ణ ఆరోగ్యానికి వ్యాయామం ప్రధానం
- ఊబకాయం, మధుమేహం, రక్తపోటు నుంచి విముక్తి
- అవగాహన కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం తెస్తున్న వాకర్స్ క్లబ్



తిరువూరు మండలంలోని గ్రామాల్లో సైక్లింగ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు (ఫైల్)

తిరువూరు: ఒత్తిడితో కూడిన జీవితంలో ప్రతి రోజూ వ్యాయామం చేస్తే వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చనే నినాదంతో తిరువూరులో ప్రారంభించిన వాకర్స్ క్లబ్ పలు కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం తీసుకువస్తోంది. 2011లో ఏర్పడిన ఈ క్లబ్ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, మధుమేహ రోగుల దినోత్సవం, వరల్డ్ హార్ట్ డే, పర్యావరణ దినోత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి కృషి చేస్తోంది. డాక్టర్ తాళ్లూరి రామకోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ క్లబ్‌లో 150 మంది సభ్యులు ఉన్నారు. కోకిలంపాడు రోడ్డులోని ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్ ట్రాక్ ఏర్పాటు చేయగా, ప్రతిరోజూ 200 మందికి పైగా ఉదయపు నడకలో పాల్గొంటున్నారు. సైక్లింగ్‌తో సైతం శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని, గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్, ఊబకాయం నుంచి విముక్తి పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

గ్రామాల్లోనూ అవగాహన కార్యక్రమాలు

నడక, సైక్లింగ్ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తూ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్నతనంలోనే శారీరక శ్రమ లేక మెదడు సైతం చురుకుగా పనిచేయదని, 30 సంవత్సరాల లోపు వారికి కూడా గుండె జబ్బులు రావడం మారుతున్న ఆరోగ్య పరిస్థితులకు నిదర్శనమని వైద్యులు చెబుతున్నారు. రోజుకు 45 నిముషాల చొప్పున వారంలో ఐదు రోజుల కనీసం సైక్లింగ్ లేదా ఉదయం, సాయంత్రం వేళల్లో నడక ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని సూచిస్తున్నారు. నిత్యం వ్యాయామంతో పని మీద శ్రద్ధ పెరుగుతుందని, విద్యార్థుల్లో చదువుపై ఏకాగ్రత కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు.



ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించిన వాకర్స్ క్లబ్ సభ్యులు (ఫైల్)

పర్యావరణ పరిరక్షణపై ప్రచారం

వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి ఇంటింటా మొక్కలు నాటాలని, పచ్చదనంతో ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉంటారని వాకర్స్ క్లబ్ సభ్యులు ప్రచారం చేస్తూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాడు మొక్కలు నాటుతున్నారు. వినాయక చవితి నాడు రంగు బొమ్మలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన బొమ్మలను వినియోగిస్తే వాతావరణ కాలుష్యం కలుగుతుందని హెచ్చరిస్తూ చిన్న మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

నిత్యం వ్యాయామం చేయాలి



ప్రతి రోజూ వ్యాయామం చేయడం శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో అవసరం. నేటి సమాజంలో అధిక శాతం ప్రజలు ఒత్తిడికి గురవుతుండటంతో త్వరగా గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ వ్యాధుల బారిన పడుతున్నారు. సైక్లింగ్ లేదా నడకతో ఈ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి వాకర్స్ క్లబ్ ద్వారా అవగాహన కార్యక్రమాలతో పాటు క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాలు, సాధారణ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ తాళ్లూరి రామకోటేశ్వరరావు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు, తిరువూరు

నిబంధనల మేరకే విక్రయాలు జరపాలి

ఏఓ పద్మ

తిరువూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున ఎరువులు, పురుగుమందుల డీలర్లు నిబంధనల మేరకే అమ్మకాలు జరపాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో బుధవారం మండలంలోని ఎరువులు, పురుగు మందుల డీలర్ల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయ శాఖ నుంచి అనుమతి పొందిన ఇన్‌వాయిస్‌లతోనే స్టాకు తీసుకు రావాలని, సోర్స్ సర్టిఫికెట్ ఉన్న స్టాక్ మాత్రమే విక్రయించాలని చెప్పారు. ప్రతి అమ్మకానికి రైతులకు బిల్లులు ఇవ్వాలని, ఎంఆర్‌పీకి మించి ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించవద్దని సూచించారు. లైసెన్సు కలిగిన డీలర్లు ప్రతి రోజూ స్టాక్ బోర్డు, ధరల పట్టిక నిర్వహించాలని, వ్యవసాయ శాఖ సర్టిఫై చేసిన బిల్లు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు మాత్రమే వినియోగించాలని తెలిపారు. కొత్త గోదాములు కొనుగోలు చేసినా, లీజుకు తీసుకున్నా సంబంధిత అధికార పత్రాలను లైసెన్సులలో నమోదు చేయించుకోవాలని, అనుమతి లేని కంపెనీల వద్ద సరుకు కొనుగోలు చేయవద్దని, నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని పలువురు ఎరువులు, పురుగు మందుల డీలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ పద్మ

బడి ఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి

నూజివీడు: బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండాలని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ హెచ్ఎం బి. హేమలత అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా బుధవారం హైస్కూల్ నుంచి చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు వయస్సున్న పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో చేరాలన్నారు. బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టప్రకారం నేరమని, ఎవరూ పనిలో పెట్టుకోవద్దన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సదుపాయాలు, సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, మధ్యాహ్న భోజన పథకం కింద నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని, ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్‌లు తదితర వాటిని ఇస్తుందని చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఆర్ఆర్ హైస్కూల్ విద్యార్థులు

రేపటి నుంచి ఇండియన్ స్టార్టప్స్‌పై అంతర్జాతీయ సదస్సు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాకరపర్తి భావనారాయణ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో 'ఇండియన్ స్టార్టప్స్ – సమస్యలు – సవాళ్లు – అవకాశాలు' అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తామని ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల కమిటీ కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ పారిశ్రామిక రంగ అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం స్టార్టప్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతలోని నూతన ఆలోచనలకు ప్రోత్సాహాన్ని అందించి పారిశ్రామిక రంగం వైపు అడుగులు వేసే దిశగా తీర్చిదిద్దుతున్నాయన్నారు. ఈ క్రమంలో స్టార్టప్స్‌కు సంబంధించిన అనేక అంశాలపై సుదీర్ఘమైన చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. తద్వారా పారిశ్రామిక రంగానికి యువత అభ్యున్నతికి మేలు జరుగుతుందన్నారు. ఆ క్రమంలో తమ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సుకు సంబంధించి ఈనెల 21వ తేదీన జరిగే ప్రారంభ సభకు స్థానిక శాసనసభ్యుడు వై. సత్యనారాయణ (సుజనా)చౌదరి ముఖ్యఅతిథిగా, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సదరన్ రీజనల్ సెంటర్ డైరెక్టర్ ఆచార్య బి. సుధాకర్‌రెడ్డి గౌరవ అతిథిగా హాజరవుతారన్నారు. అదేవిధంగా మలేషియాకు చెందిన ఏషియన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆచార్యులు షరన్‌కుమార్‌షెట్టి కీలక ఉపన్యాసకునిగా, యూఎస్ఏకు చెందిన ఆచార్య సత్యనారాయణ పరియిటమ్ ప్రధాన వక్తగా పలు విశ్వవిద్యాలయాలు, పారిశ్రామిక సంస్థలకు చెందిన ప్రముఖులు వక్తలుగా హాజరవుతారని వివరించారు. రెండో రోజు జరిగే ముగింపు సభకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ రెగ్యులేటరీ అండ్ మోనటరింగ్ కమిషన్ మెంబర్ సెక్రటరీ అండ్ సీఈఓ ఆచార్య డి. సూర్యచంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని వివరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రముఖులు హరగోపాల్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేష్, అధ్యాపకులు హేమంత్‌కుమార్, అరుణ్‌కుమార్, రవికిరణ్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తూనికుంట్ల శ్రీనివాసు

పాల దిగుబడి పెంపునకు కృషి

మునునూరు: పాడి రైతులు పాల దిగుబడిని మరింత పెంచేందుకు కృషి చేయాలని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. పాడి రైతు సంక్షేమం మన మతం – అలుపెరుగని సేవ మన అభిమతం కార్యక్రమంలో భాగంగా మండలంలోని సూరేపల్లి, గొల్లగూడెంలోని పాల సేకరణ కేంద్రాలను ఆయన సందర్శించి పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమాల్లో పాల సేకరణ సంఘాల అధ్యక్షులు బల రాఘవయ్య, శ్రీనివాసరావు, హనుమాన్ జంక్షన్ క్లస్టర్ మేనేజర్ హరి పాల్గొన్నారు.

వాహనాల వేలం ద్వారా రూ. 99 వేల ఆదాయం

జగ్గయ్యపేట అర్బన్: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 18న నిర్వహించిన వేలంపాటకు అనూహ్య స్పందన లభించిందని స్పెషల్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జగ్గయ్యపేట సీఐ మణికంఠరెడ్డి బుధవారం తెలిపారు. 8 ద్విచక్రవాహనాలు, ఆటోలకు నిర్వహించిన బహిరంగ వేలానికి ప్రభుత్వం నిర్ణయించిన రూ.62,500 ధరకుగాను వేలం ద్వారా రూ.98,800 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అనగా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు 58.08శాతం పెరుగుదల కనిపించిందన్నారు. అదేవిధంగా జీఎస్టీ రూపంలో రూ.17,784 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ. సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు స్ట్రీట్, కోనేరుపేట తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ పశువుల హాస్పటల్ ఫీడర్, 11 కేవీ రిలయన్స్ మార్ట్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా గురువారం ఉదయం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మయ్య బజార్, కట్ట బజార్, ఆశ హాస్పటల్ రోడ్డు, మైలురాయి సెంటర్ ఏరియా, సాయిరాం, ఆర్‌సీఎం చర్చి ఏరియా, బొడ్డు రాయి సెంటర్ ఏరియాలలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

ఠాగూర్ గ్రంథాలయానికి ఐరన్ బుక్ ర్యాక్స్ బహూకరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో పుస్తకాలు భద్రపరిచేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, విజయవాడ రీజియన్–1 పుస్తకాల ర్యాక్స్ బహూకరించింది. బుధవారం బ్యాంక్ లబ్బీపేట బ్రాంచ్ మేనేజర్ ఎంవీఎస్ ప్రవీణ్‌కుమార్ రూ. 30 వేల విలువ చేసే 15 ర్యాకులను గ్రంథాలయాధికారి రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంక్ గ్రంథాలయాభివృద్ధికి తోడ్పాటు నందిస్తోందన్నారు. గ్రంథాలయ అభివృద్ధిలో తాము భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. ఠాగూర్ గ్రంథాలయం ఎంతో మంది పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తోందన్నారు. వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తోందన్నారు. విజయవాడ జోనల్ మేనేజర్ డి. విజయకుమార్ మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థుల ఉన్నతికి గ్రంథాలయం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. అనంతరం గ్రంథాలయ అధికారి కె.రమాదేవి దాతలకు జ్ఞాపిక అందజేసి శాలువాతో సత్కరించారు.



గ్రంథాలయానికి బుక్ ర్యాక్స్ అందజేస్తున్న స్టేట్ బ్యాంక్ ప్రతినిధులు

సున్నిత హాస్యానికి చిరునామా జంధ్యాల



జంధ్యాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వేముల హజరత్తయ్య గుప్తా, కుమార్ తదితరులు

విజయవాడ కల్చరల్: సున్నితమైన హాస్యానికి చిరునామా దర్శకుడు జంధ్యాల అని సీనియర్ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. కళామంజరి సాంస్కృతిక సేవా సంస్థ, అభిరుచి, సి. రామ్మోనరావు కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని సినీ దర్శకుడు, నటుడు, మాటల రచయిత జంధ్యాల విగ్రహం వద్ద బుధవారం 23వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ కుటుంబ కథా చిత్రాలకు దర్శకత్వం వహించిన జంధ్యాల జీవితం నగరంతో ముడిపడి ఉండటం విశేషమన్నారు. జంధ్యాల నగరంలోని ప్రభుత్వ కళాశాలలో చదువుకున్నారన్నారు. తెలుగు వారి హాస్య చతురత ప్రపంచానికి తెలియ జేశారని కొనియాడారు. 23కు పైగా జాతీయ స్థాయి అవార్డులు గెలుచుకున్నారన్నారు. కళామంజరి వ్యవస్థాపకుడు పీవీఎల్ నృసింహం మాట్లాడుతూ చిరంజీవి లాంటి మెగాస్టార్‌తో హాస్య చిత్రానికి దర్శకత్వం వహించడం ఆయనకే చెల్లిందన్నారు. కార్యక్రమంలో రంగస్థల నటుడు ఆచంట బాలజీ నాయుడు, చివుకుల హరగోపాల్ పరచూరి విజయలక్ష్మి, గాయకుడు కుమార్‌తోపాటు జంధ్యాల అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత జంధ్యాల విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్న, వస్త్ర దానం చేశారు.

ప్రమాదం అంచున విహారం



ఈత ఆరోగ్యదాయకమే.. అయినా అది ఎక్కడ చేయాలో.. ఏ పరిస్థితుల్లో చేయాలో అక్కడే చేయాలి. నదీ గర్భాల్లో.. అధిక లోతు, సుడిగుండాలు ఉండే ప్రాంతాల్లో సరదాగా ఈతకు దిగితే ప్రాణాల మీదకు వస్తుంది. ఈ చిత్రం చూడండి.. కృష్ణలంక, తాడేపల్లి మధ్య ఉన్న కృష్ణా నదిలోని గుంతల్లో కొందరు చిన్నారులు ప్రమాదకరంగా స్నానాలు చేస్తుండగా మరికొందరు ఈత కొడుతున్నారు. ఆ ప్రదేశంలో లోతు ఎక్కువగా ఉండటంతో చాలా మంది స్నానాలకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. ఇప్పటికైనా పెద్దలు పిల్లలకు ప్రమాదాలపై అవగాహన కల్పించడంతో పాటు అప్రమత్తంగా వ్యవహరించాలి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ



చాటపల్లిలో బ్యాగులు పంపిణీ చేస్తున్న సర్పంచి రాజేశ్వరి



ఈదరలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్ఎం శారద



గొల్లపల్లి హైస్కూల్‌లో విద్యార్థులకు అందజేస్తున్న స్కూల్ కిట్లు

నూజివీడు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలను కల్పించడమే కాకుండా పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బ్యాగ్‌లు, షూలు, బెల్టులు ఉచితంగా అందజేస్తోందని గొల్లపల్లి హైస్కూల్ హెచ్ఎం పొట్లూరి రాధికా రాణి అన్నారు.

మండలంలోని గొల్లపల్లి హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు స్కూల్ కిట్లను పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను, సౌకర్యాలను వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ పలగాని వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ గోగినేని శ్రీనివాస కుమార అప్పారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, బ్యాగులను బుధవారం పంపిణీ చేశారు. వావిలాల శివారు రాజుగూడెంలో ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు సర్పంచి అలవాల రాధ, ఎంపీటీసీ సభ్యురాలు కంచపోగు లక్ష్మి వీటిని అందజేశారు. చౌటపల్లి ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులకు సర్పంచి యరమల రాజేశ్వరి బ్యాగులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రధానోపాధ్యాయిని శారద అన్నారు. మండలంలోని ఈదర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దొండపాటి అనిత, దొండపాటి ఏసుపాదం, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ అంజి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునునూరు: రమణక్కపేట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, కిట్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కొండా దుర్గాభవాని, నేతలు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగు ధనలక్ష్మీగాంధీ, రంగు బుజ్జి, గోళ్ల గుర్నాథం, పాశం నాగబాబు, కొండా వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

జుజ్జూరు(వీరులపాడు): విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలని ఎంఈఓ పాల్‌కెనడీ అన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు అందించే ఆహార తయారీలో పరిశుభ్రత పాటించాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ఆయన పాఠశాల రికార్డులను పరిశీలించారు.

మద్యం సీసాలు ధ్వంసం

జగ్గయ్యపేట అర్బన్ : గత ఏప్రిల్ నెలలో జగ్గయ్యపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో నమోదు చేసిన 52 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 1,752 లీటర్ల మద్యం, 67.75 లీటర్ల బీరు, 7.5 లీటర్ల తాటి కల్లును బుధవారం ధ్వంసం చేశారు. తిరుమలగిరి సమీపంలోని ఆటోనగర్ వద్ద డోజర్‌తో వీటిని ధ్వంసం చేయించినట్లు ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకోవాలి



తిరువూరు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు లేక మురుగునీరు, వర్షంనీరు రోడ్లపై నిలిచిపోతున్నందున వెంటనే మురుగునీరు పారుదలకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు నగర పంచాయతీ అధికారులను ఆదేశించారు. 15వ వార్డు ఇందిరా కాలనీలో ఆర్ అండ్ బీ రహదారిపై వర్షం నీరు నిలిచిపోయి పాదచారులు, వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన మాట్లాడుతూ వెంటనే తాత్కాలిక మురుగునీటి కాలువలు తవ్వించి నీరు పోయే ఏర్పాట్లు చేయాలని నగర పంచాయతీ కమిషనర్ లోవరాజును ఆదేశించారు.

ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలి

మైలవరం: ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలంటే రక్త శాతాన్ని పెంపొందించుకోవాలని శ్రీ లీలావతి స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉడతా లక్ష్మీనారాయణ అన్నారు. మైలవరం శ్రీ లీలావతి పబ్లిక్ స్కూల్‌లో ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలు గల ఆహారాన్ని, విటమిన్లు గల పదార్థాలను మనం నిత్య ఆహార విధానంలో ఉండేటట్లు చూసుకోవాలన్నారు. పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి

మునుకుళ్ల(తిరువూరురూరల్): మండలంలోని మునుకుళ్లలో తెగిపడిన విద్యుత్ తీగెలను తాకిన రెండు పాడి గేదెలు బుధవారం మృతి చెందాయి. గ్రామంలోని రైతు కొంగల అంజయ్యకు చెందిన పాడి గేదెలు పొలంలో మేతకు వెళ్లి విద్యుత్ వైర్లను తాకి అక్కడికక్కడే చనిపోయాయి. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని రైతు తెలిపారు. విద్యుత్ అధికారులు తమ గేదెలకు నష్టపరిహారం చెల్లించాలని, పొలాల్లో కిందకి వేలాడే తీగెలను, తెగిపడిన విద్యుత్ వైర్లను సరిచేయాలని అంజయ్య కోరారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

చాట్రాయి: ఎరువులను ఎంఆర్‌పీకే విక్రయించాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ అన్నారు. బుధవారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే రైతులు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన సరుకులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, స్టాకు బోర్డు పెట్టాలని దుకాణాదారులకు సూచించారు. అనంతరం చనుబండ ఎరువుల దుకాణంలో మొలకెత్తిన నారుని ఆయన పరిశీలించారు.

28న దేవస్థానం భూముల కౌలు వేలం

బలివే (ముసునూరు): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన బలివే రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన సేద్యపు భూముల కౌలుకు ఈనెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తామని ఆలయ ఈఓ సతీష్‌కుమార్ తెలిపారు. బలివేలో స్వామివారి దేవస్థానానికి చెందిన రీ–సర్వే నంబర్ 186లో ఉన్న ఎ. 7.00 సెంట్ల వ్యవసాయ భూమిని మూడేళ్ల కాల పరిమితికి కౌలుకు పంటలు పండించుకునే నిమిత్తం వేలం నిర్వహిస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో జరుగనున్న టెండర్ కమ్ బహిరంగ వేలంలో డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని చెప్పారు.

పెండ్యాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



పెండ్యాల(కంచికచర్ల) : మండలంలోని పెండ్యాల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ విద్యాల భాగ్యరేణుక మాట్లాడుతూ ఇప్పటివరకు అంగన్‌వాడీ ప్రీ స్కూల్‌లో చదివి ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్పిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పిస్తున్నామన్నారు. కేంద్రాల్లో ప్రీ స్కూలు మెటీరియల్ ఎగ్జిబిషన్‌లు నిర్వహించి చిన్నారుల తల్లులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగనవాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కరీమా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.